



మంత్రి బొత్సను అడ్డుకున్న అంగన్వాడీలు



మున్సిపల్ కార్మికుల రాస్తారోకో



కలెక్టరేట్ శిబిరంలో నిద్రపోతున్న అంగన్వాడీలు

- గర్జించిన కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు
- ప్రభుత్వం స్పందించాలని నినాదాలు

దద్దరిల్లిన కలెక్టరేట్



స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన

కలెక్టరేట్, జనవరి 8: కార్మికులు... కర్షకులు... ఉద్యోగులు... నిరుద్యోగులు నిరసనలతో గర్జించారు... అరుపులు .. కేకలతో కలెక్టరేట్‌ను సోమవారం మార్మోగించారు. వందలాదిగా తరలి వచ్చి ఆందోళన చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. మున్సిపల్ కార్మికులు, నిరుద్యోగులు, రైతులు కూడా వారి బాటలోనే ఉన్నారు. మరోవైపు విశాఖ ఉక్కును కాపాడాలంటూ కార్మికులు గర్జించారు.

● ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ ఏపీ మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో 16 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేసి వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. ● విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన ఇసుక, మాంగనీస్ ఓర్ తవ్వకాల అనుమతులను రెన్యూవల్ చేయాలంటూ సీల్డ్ ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ నుంచి వివిధ కార్మిక సంఘ నాయకులు కలెక్టరేట్ వద్దకు వచ్చి స్థానిక నాయకులతో కలిసి నిరసన తెలిపారు. సీల్డ్ ప్లాంట్ పరిరక్షణ సంఘం కమిటీ ఛైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లాలో లీజు పొడిగించకుంటే ప్లాంట్ మనుగడ కష్టతరంగా మారుతుందన్నారు.

● ధాన్యం సేకరణలో భాగంగా రైతుల నుంచి బస్తాకు అదనంగా మిల్లర్లు ధాన్యం తీసుకుంటున్నారని ఏపీ రైతు సంఘం నాయకులు బి.రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందించాలన్నారు.

అంగన్వాడీల దీక్ష

విజయనగరం (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలు దీక్షలకు దిగారు. ఎస్మా ప్రయోగించటం దుర్మార్గపు చర్య అని, ఇలాంటి నోటీసులకు భయపడేది లేదంటూ 24 గంటల దీక్షను సోమవారం ప్రారంభించారు. రాత్రి శిబిరంలోనే నిద్రకు ఉపక్రమించారు.

మంత్రిని అడ్డుకున్న అంగన్వాడీలు

గజపతినగరం, జనవరి 8: ఎస్మాను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు మంత్రి బొత్స సత్యనారాయణను సోమవారం అడ్డుకున్నారు. మెంటాడ మండలంలో పర్యటన ముగించుకొని తిరిగి వస్తుండగా గజపతినగరం చంపావతి వంతెన వద్ద జాతీయ రహదారిపైకి వచ్చి మంత్రి వాహనాన్ని అడ్డగించారు. దీంతో ఆయన కారుదిగి వచ్చి మాట్లాడుతూ వేతనం పెంచేందుకు రెండు నెలల సమయం కావాలని ప్రభుత్వం కోరినా పట్టుబట్టడం సమంజసం కాదన్నారు. ఫొటోలు తీస్తున్న సీఐటీయు నాయకులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫొటోలు తీస్తే మాట్లాడేదిలేదన్నారు. అనంతరం వారి నుంచి వినతిపత్రాన్ని తీసుకున్నారు. ఆందోళనలో నాయకులు సుభాషిణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధం ఇంకెప్పుడు?



సభాస్థలిని పరిశీలిస్తున్న కళావెంకటరావు, బేబీనాయన, భంజ్‌దేవ్


- రాష్ట్రంపై రూ.12 లక్షల కోట్ల అప్పులు
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు

బొబ్బిలి, జనవరి 8: ఒక్కచాన్స్ అంటూ జనాల్ని మోసగించి అధికారంలోనికి వచ్చిన జగన్ దశలవారీ మద్యనిషేధం అమలు చేస్తానని చెప్పి మడమ తిప్పేశాడని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు విమర్శించారు. ఈ నెల 10న బొబ్బిలిలో తెలుగుదేశం పిలుస్తోంది..రా..కదలి రా కార్యక్రమం జరుగనుండడంతో ఏర్పాట్ల పరిశీలనకు ఆయన సోమవారం ఇక్కడికి వచ్చారు. స్థానిక దర్బారుమహల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో దశల వారీగా మద్యపాన నిషేధాన్ని సంపూర్ణంగా ఆచరణలో పెడ్తానని ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పిన జగన్ ఇంకెప్పుడు మద్య నిషేధం అమలు చేస్తావని ప్రశ్నించారు. మద్యనిషేధం లేదు సరికదా హానికరమైన నాశిరకం మద్యాన్ని ప్రజలకు అమ్ముతూ వారి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్‌పైనా మాట తప్పాడని, రూ.800 ఉండే ఇసుకను ఏకంగా ఆరువేల రూపాయలకు పెంచేశాడన్నారు. జగన్ నిర్వాకంతో 60 శాతం ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పది రూపాయలు ఈ చేత్తో ఇచ్చి, వందరూపాయలను ధరలు, పన్నుల రూపంలో లాక్కుంటున్నారన్నారు. రూ.12 లక్షల కోట్ల అప్పును రాష్ట్రంపై భారంగా మోపారన్నారు. మరో 50 రోజుల్లో ఓటు అనే ఆయుధంతో వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

● ఈ నెల 10 న బొబ్బిలి సంస్థానం హైస్కూలు మైదానంలో నిర్వహించనున్న తెలుగుదేశం పిలుస్తోంది రా కదలి రా సభకు చంద్రబాబు వస్తున్నారని, విజయవంతం చేయాలని కళావెంకటరావు పిలుపునిచ్చారు. సభా స్థలాన్ని, హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వెంట బేబీనాయన ఉన్నారు.

రా.. కదలిరా..

- రేపే చంద్రబాబు బొబ్బిలి పర్యటన



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 'రా.. కదలిరా..' పేరుతో జిల్లాలకు వెళ్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం బొబ్బిలి వస్తున్నారు. ఈ సందర్భంగా రాజా కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టనున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఎం చేయబోతున్నదీ వివరిస్తారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రం ఏవిధంగా వెనుకబాటుకు గురైందీ వివరించనున్నారు. ఈనెల 10న ఉదయం 10గంటలకు సభ ప్రారంభం కానుంది. రాష్ట్ర నలుమూలల నుంచి టీడీపీ కీలక నేతలు సమావేశానికి హాజరు కానున్నారు. ముఖ్య నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.



అంగన్వాడీలకు మద్దతు పలుకుతున్న రఘురామరాజు

కార్మికుల సంక్షేమం పట్టదా?

- బస్సుయాత్రలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు
- మళ్లీ జగన్ వస్తే మహిళలు రోడ్డుపైకి రాలేరు: ఎమ్మెల్సీ వేపాడ

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్, జనవరి 8 : రాష్ట్రంలో లక్షా 30 వేల మంది కార్మికులు, 350కి పైగా శిబిరాల్లో ధర్నాలు చేస్తుంటే.. నిరసన తెలియజేస్తుంటే ఒక్క మంత్రి, ఎమ్మెల్యే అయినా పరామర్శించారా? సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారా.. ? వీరికి పదవి తప్పా ప్రజా, కార్మికుల సమస్యలు పట్టవా..?అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్క రఘురామరాజు ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి కుప్పం వరకు చేపట్టిన కార్మిక చైతన్య బస్సుయాత్ర విజయనగరంలో సోమవారం సాగింది. కోట జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతల్లో అహంకారం పోయేలా.. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం నిలబడేలా.. సైకో ముఖ్యమంత్రిని మనమంతా ఇంటికి పంపించాలని రఘురామరాజు పిలుపునిచ్చారు. నగరంలో కార్మిక నేతలంతా పర్యటించారు. టీడీపీ విజయనగరం నియోజక వర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు కూడా పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న కార్మికులకు మద్దతు పలికారు. కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో ఉన్న అంగన్వా డీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులతోనూ మాట్లాడారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీరావు మాట్లాడుతూ జగన్ సైకోపాలన వల్ల కార్మికులు, కూలీలు మాత్రమే కాదు ఉద్యోగ, ఉపాధ్యాయులు కూడా రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ సైకో జగన్ వస్తే ఆడవారు రోడ్డుపైకి రాలేరని అన్నారు.

అమ్మలాంటి అంగన్వాడీలను ఇబ్బందులు పెట్టడం, వారిని నోటీసుల ద్వారా బెదిరించడం దుర్మార్గపు చర్యని అదితిగజపతిరాజు విమర్శించారు.

సీఐలకు స్థానచలనం

- ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు డీఐజీ ఆదేశాలు

విజయనగరం క్రైం, జనవరి 8: విశాఖపట్నం రేంజ్ పరిధిలో కొందరు సీఐలకు స్థానం చలనం కలిగిస్తూ విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ నిబంధనల అమలులో భాగంగానే ఈ బదిలీలు చేపట్టారు. విజయనగరం రూరల్ సీఐ టీవీ తిరుపతిరావును విశాఖ సిటీకి బదిలీ చేశారు. విజయనగరం టూటౌన్ సీఐ ఎన్‌హెచ్‌వీ ఆనంద్‌ను శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ టౌన్ యుపీఎస్ సీఐగా పంపారు. ఈయన స్థానంలో విశాఖ సిటీలో బాధ్యతలు నిర్వహిస్తున్న కె.రామారావును నియమించారు. విశాఖ రేంజ్ వీఆర్‌లో వున్న వీవీ జగన్నాథరాజును విజయనగరం వీఆర్‌కి మార్చారు. విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో వున్న పి.రంగనాథంను విజయనగరం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. విశాఖ సిటీలో వున్న టీవీ విజయ్‌కుమార్‌ను సోషల్ మీడియా సైబర్ సెల్ విజయనగరం సీఐగా బదిలీ చేశారు. బదిలీ అయిన సీఐలు వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో విధులకు హాజరుకావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆ ఇద్దరూ బొత్స వద్దకు

- అనుచరులతో మంత్రి ఇంటికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ
- వాడీవేడిగా ఎస్.కోట వైసీపీ పంచాయితీ
- ఈసారీ టిక్కెట్టు నాదే: కడుబండి శ్రీనివాసరావు
- కాంగ్రెస్ నుంచి ఆఫర్ వచ్చింది కానీ..: రఘురాజు



బొత్స ఇంట్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జనవరి 8 : కొన్నాళ్లుగా ఎస్.కోట నియోజకవర్గ వైసీపీలో సాగుతున్న కలహాలు ముదిరిపాకాన పడ్డాయి. మండలాల వారీగా వేర్వేరు వర్గాలుగా విడిపోయి.. సమావేశాలు నిర్వహిస్తూ.. నిరసనలు తెలియజేస్తూ.. పార్టీ పెద్దలకు విన్నపాలు ఇస్తూ వస్తున్న నేతలు తాజాగా ఒకేరోజు వేర్వేరుగా తమ అనుచరులతో మంత్రి బొత్సను కలిశారు. ప్రస్తుతం పంచాయితీ అంతా టిక్కెట్టు చుట్టూ తిరుగుతోంది. ఎమ్మెల్యే కండుబండి మాత్రం తనకే టిక్కెట్టు అని ధీమాగా చెబుతున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఎస్.కోట వైసీపీ రాజకీయం చాలా వేగంగా వేడెక్కుతోంది. ప్రతిరోజూ నేతలు, అనుచరులు వార్తలకు ఎక్కుతున్నారు. స్థానిక నేతకే టిక్కెట్టు అన్న నినాదాన్ని కూడా తెరపైకి బలంగా తీసుకొచ్చారు.

ఇద్దరు కీలక నేతలూ ఎమ్మెల్యే టిక్కెట్ కోసం బహిరంగంగానే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అధిష్ఠానం దృష్టికీ తీసుకెళ్లారు. కొద్దిరోజుల కిందట వైసీపీ జిల్లా అధ్యక్షుని దగ్గర పంచాయితీ నడిచింది. కొలిక్కి రాకపోగా పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వద్దకు చేరింది. అయినా ఏమ్రాతం మార్పు రాలేదు. తాజాగా సోమవారం విజయనగరంలో మంత్రి బొత్స సత్యన్నారాయణ ఇంటికి తమ తమ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు వెళ్లారు. ముందుగా ఎమ్మెల్యే కలిశారు. అనంతరం గజపతినగరం, మెంటాడ పర్యటనకు వెళ్తున్న బొత్స కారులో ఎమ్మెల్సీ కూర్చొని తమ ఆకాంక్షను తెలిపినట్లు సమచారం. బొత్సను కలిసిన అనంతరం ఎమ్మెల్యే కడుబండి సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్.కోట టిక్కెట్‌ను అధిష్ఠానం తనకే కేటాయించిదని చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యన్నారా యణలు తన పనితీరు బాగుందని, నియోజకవర్గంలో గెలిచి మరింత పేరు తెచ్చుకోవాలని సూచించినట్లు తెలిపారు. విశాఖ ఎంపీ సీటు బొత్స ఝాన్సీకి ఇస్తారని ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో ఆమెకు శుభాకాంక్షలు తెలిపేందుకే వచ్చానన్నారు. ఎమ్మెల్యే సీటును ఎవరైన ఆశించవచ్చని, ఎమ్మెల్సీ కూడా అడుగుతున్నారని, ఆశించడంలో తప్పులేదు కానీ టిక్కెట్ మాత్రం తనదేనని కడుబండి స్పష్టంచేశారు.



బొత్స కారులో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

టిక్కెట్ ఆఫర్ వచ్చింది కానీ..

కాంగ్రెస్ పార్టీలో చేరాలని కొంతమంది నాయకులు తనను అడిగారని, ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తామని ఆఫర్ కూడా ఇచ్చారని, వైసీపీలో బాగుందని వారికి చెప్పినట్లు మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చిట్‌లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. బొత్సను కలిసేందుకు విజయనగరం సోమవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో కొద్దిసేపు మాట్లాడారు. ఇదివరకు కాంగ్రెస్ తరుపున ఎస్.కోట నియోజకవర్గంలో పోటీ చేసినప్పుడు 31 వేలు పైచిలుకు ఓట్లు వచ్చాయని, అందుకే ఆ పార్టీ ఆహ్వానించిందని చెప్పారు.

తాడేపల్లికి బెల్లాన

- విజయనగరం ఎంపీ సీటుపై అనుమానాలు
- విశాఖ ఎంపీగా పోటీకి ఝాన్సీ ప్రయత్నాలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ముఖ్యమంత్రి కార్యాలయం తాడేపల్లి నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో చర్చించేందుకు వెళ్లారు. వచ్చే ఎన్నికల్లో సీటుపై చర్చించేందుకే పిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. బెల్లాన గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం ప్రయత్నించారు. చివరి క్షణంలో ఎంపీగా బీఫారాన్ని పొందారు. తన నియోజకవర్గ పరిధిలో చెప్పుకోదగ్గ పనులు చేయలేదన్న ఆరోపణను ఎదుర్కొంటున్నారు. పార్టీ పరంగా కూడా పెద్దగా పట్టు సాధించిన పరిస్థితి కన్పించడం లేదు. ఈ పరిస్థితిలోనే అధిష్ఠానం పిలిపించి చర్చలు జరుపుతున్నట్లు జిల్లాలో ప్రచారం సాగుతోంది.

● బొబ్బిలి(విజయనగరం) లోక్‌సభ ఎంపీగా గతంలో ఉమ్మడి జిల్లాలో పనిచేసిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ విశాఖ ఎంపీగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సోమవారం విజయనగరంలో ఆమె మీడియాతో మాట్లాడారు. విశాఖ ఎంపీగా పోటీ చేయాలని అధిష్ఠానం ఆదేశిస్తే సిద్ధమేనని వెల్లడించారు. తాను విశాఖ జిల్లాకు చెందిన స్థానికురాలిగా చెప్పారు. తల్లిదండ్రులు, వారు ఇచ్చిన ఆస్తులు విశాఖ జిల్లాలోనే ఉన్నాయన్నారు. ఏదైనాగాని విజయనగరం, విశాఖ ఎంపీ సీట్ల వ్యవహారంపై ఒకేసారి జిల్లాలో విస్తృత చర్చలు జరుగుతున్న పరిస్థితి కన్పిస్తోంది.


రాజాం: మాట్లాడుతున్న కోండ్రు


సాలూరు: మాట్లాడుతున్న రామానాయుడు


జియ్యమ్మవలస: మాట్లాడుతున్న చిట్టి మోహన్‌రావు


గరుగుబిల్లి: మాట్లాడుతున్న గోవిందరావు

జాతరలా తరలిరండి

● బొబ్బిలిలో చంద్రబాబు సభను విజయవంతం చేయండి ● కార్యకర్తలకు టీడీపీ నాయకుల దిశానిర్దేశం

రామభద్రపురం, జనవరి 8: తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 10న బొబ్బిలిలో జరపనున్న సభను విజయవంతం చేయాలని బొబ్బిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేబీ నాయన కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో జనసమీకరణకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. రాష్ట్రానికి మళ్లీ నారా చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయితేనే రాష్ట్రంలో అన్ని రంగాల్లో పురోగతి చెందుతుందని అన్నారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **రాజాం:** బొబ్బిలిలో ఈనెల 10న 'రా.. కదిలిరా' సభకు కార్యక్రమానికి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నారని నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని మాజీ మంత్రి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ కోరారు. సోమవారం ఆయన కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, వంగా వెంకటరావు శాసపు రమేష్ కుమార్, పొట్నా చిట్టిబాబు, గురవాన నారాయణరావు జరజాన నీలయ్య తదితరులు పాల్గొన్నారు. ● **సాలూరు:** బొబ్బిలిలో ఈనెల పదో తేదీన జరిగే రా.. కదలిరా.. బహిరంగ సభను విజయవంతం చేయాలని మాడుగుల మాజీ ఎమ్మెల్యే, కార్యక్రమ పరిశీలకుడు గవిరెడ్డి రామానాయుడు కోరారు. సాలూరులోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి నివాసం వద్ద ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు. ● **జియ్యమ్మవలస:** బొబ్బిలిలో చంద్రబాబు నాయుడు నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల పరిశీలకుడు చిట్టి మోహన్‌రావు కోరారు. సోమవారం మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు కోటలో సన్నాహక సమా వేశం నిర్వ హించారు. మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, డొంకాడ రామకృష్ణ, బొంగు సురేష్, రెడ్డి బల రాం స్వామినాయుడు, లంక గోపాలం, నందివాడ కృష్ణ, జోగి భుజంగరావు, జనసేన పార్టీ నాయకులు శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.


భోగాపురం:మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు



గజపతినగరం, రామభద్రపురంలో మాట్లాడుతున్న కేఏనాయుడు, బేబీనాయన

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సభకు పార్టీ అధినేత చంద్రబాబు హాజరవుతారని చెప్పారు.

గరుగుబిల్లి: చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు కోరారు. సోమవారం ఉల్లిభద్ర సముదాయంలో పార్టీ మండల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పరిశీలకుడు నందివాడ గోవిందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం, అంబటి రాంబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ● **భోగాపురం:** రాష్ట్రంలో సైకో పాలన నుంచి విముక్తి పొందాలంటే ప్రతిఒక్కరూ కదలి రావాలని టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు కోరారు. పోలిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. బొబ్బిలిలో చంద్రబాబు ఆధ్వర్యంలో రా.. కదిలిరా.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, కర్రోతు రాజు, బడె నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **గజపతినగరం:** బొబ్బిలిలో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న రా.. కదిలిరా.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ గజపతినగరం నియోజకవర్గం పరిశీలకుడు పాసర్ల ప్రసాద్, కేఏనాయుడు కోరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రాంజీరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రామారావు

భామిని: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దదిమిలి గ్రామానికి చెందిన పాలక రామారావు(47) గత నెల 31న సతివాడ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపు తప్పి బోల్తాపడ్డాడు. ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో కొత్తూరు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య రూప, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బత్తిలి ఎస్ఐ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా తమకు ఇంతవరకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

గూడ్స్‌రైలు ఢీకొని వృద్ధుడి మృతి

బొబ్బిలి, జనవరి 8: గూడ్సు రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి బొబ్బిలి రైల్వే ఔట్‌పోస్టు ఇన్‌చార్జి ఎస్ఐ కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి కాలనీకి చెందిన చింతల త్రిమూర్తులు(73) సోమవారం సాయంత్రం స్థానిక దిబ్బగుడ్డివలస రైల్వే గేటు సమీపంలో గూడ్సు రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. శ్రీరాములు రైల్వే ట్రాక్ దాటుతుండగా రాయగడ నుంచి విజయనగరం వైపు బొగ్గుతో వెళ్తున్న గూడ్సు రైలు ఢీకొంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి మార్చురీకి తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. శ్రీరాములు భార్య ఈశ్వరమ్మ పదేళ్ల క్రితం చనిపోయింది. కుమారుడు రామారావు కళాసీగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి మానసిక స్థిరత్వం లేకపోవడంతో త్రిమూర్తులు రోడ్లపై సంచరిస్తున్నాడని, అన్ని చోట్ల అతని కోసం వెదుకుతున్నామని, ఇక్కడ ప్రమాదానికి గురై విగతజీవిగా కనిపించాడని కుటుంబసభ్యులు వాపోయారు.

అధిక మోతాదులో మాత్రలు మింగి..

● యువకుడి మృతి


మాధవరావు

మక్కువ, జనవరి 8: మతిస్థిమితం లేక అధిక మోతాదులో మాత్రలను మింగి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కన్నంపేట గ్రామానికి చెందిన దత్తి మాధవరావు(29) 2 సంవత్సరాల నుంచి మతిస్థిమితం లేక విశాఖ మెంటల్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మందులు వాడుతున్నాడు. ఈ నెల 2న కన్నంపేటలోని స్వగృహంలో ఎప్పటిలాగే తాను వేసుకునే మాత్రలను అధిక మోతాదులో మింగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 7న రాత్రి మరణించాడు. మృతుని తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. నరసింహ మూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


వెంకటేష్

భోగాపురం, జనవరి 8: మండలం భోగాపురం పంచాయతీ పెదఖానాల సమీపంలో జాతీయరహదారిపై రోడ్డుప్రమాదానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కృష్ణమూర్తి సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భోగాపురం గ్రామం పెదహరిజనవీధికి చెందిన మిరప వెంకటేష్(21) భవానీ మాల ధరించి యాత్రకి వెళ్లి రెండు రోజుల క్రితమే వచ్చాడు. అక్కడి నుంచి తీసుకొచ్చిన ప్రసాదం బంధువులకు ఇచ్చేందుకు కుమిలి గ్రామం వెళ్లి అక్కడినుంచి తిరిగి ద్విచక్రవాహనంపై భోగాపురం వస్తుండంగా ప్రమాదవ సాత్తు రోడ్డుపై పడి పక్కనున్న కాలువలోకి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు ఇంటర్మీడియట్ చదివును మధ్యలోనే ఆపేసి హోటల్లో పని చేసుకొంటున్నాడు. మృతుడికి తల్లి దండ్రులు బంగారమ్మ, ఆదిబాబు, చెల్లి మీనా ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని పాతబొబ్బిలి గ్రామంలో మద్యం అమ్ముతుండగా చోడిగంజి మురళి పట్టుబడినట్లు ఎస్ఐ వి.జ్ఞాన ప్రసాద్ తెలిపారు. మద్యం అమ్ముతున్నట్లు సమాచారం తెలియగానే ఏఎస్ఐ జి.భాస్కరరావు ఇతర సిబ్బందితో కలిసి సోమవారం గ్రామానికి వెళ్లి తనిఖీలు నిర్వహించి, 28 మద్యం సీసాలతో పట్టుబడిన మురళిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామన్నారు.

భోగాపురం: మండలం కొండ్రాజు పాలెం జంక్షన్‌లో 85 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. కొండ్రాజుపాలెంకు చెందిన ఎరుపల్లిసన్యాసిరావు 47 మద్యం సీసాలు, సూర్ని సన్యాసిరావు 38 మద్యం సీసాలు తీసుకెళ్తుండగా వీరి నుంచి సీసాలు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నెల్లిమర్ల: గరికిపేటలో బెల్ట్ షాపు నడుపుతున్న ఓ వ్యక్తిని నెల్లిమర్ల ఎస్ఐ పి.నారాయణరావు సిబ్బంది సోమవారం పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి సుమారు 100 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఆయ నపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వివరించారు. ఎస్ఐ నారాయణరావును, సిబ్బందిని భోగాపురం సీఐ టీవీ వెంకటేశ్వరరావు అభినందించారు.

బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస: మండలంలోని ముసిరాం పరిసర ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన దాడుల్లో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు సీఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం సిబ్బందితో కలిసి వెళ్లి దాడులు చేశామని, దీనిపై కేసు నమోదు చేస్తామన్నారు.

బాలిక అదృశ్యం

లక్కవరపుకోట: మండల కేంద్రమైన ఎల్.కోటకు చెందిన పొట్నూరు శ్రావణి (17) అదృశ్యమైనట్టు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేసినట్లు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు. బాలిక తాత జి.రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 6న ఎస్.కోట జూనియర్ కళాశాలలో పరీక్ష ఫీజుకట్టాలని వెళ్లిన శ్రావణి తిరిగి రాలేదని, చుట్టాలు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

సేవా కార్యక్రమాలే గుర్తింపునిస్తాయి

దాసన్నపేట: సేవా కార్యక్రమాలే గుర్తింపునిస్తాయని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర అన్నారు. సోమవారం లూయిస్ బ్రెయిలీ 215 జయంతి సందర్భంగా విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ యూత్ అసోషియేషన్ ప్రతినిధులు సిరి సహస్రను ధర్మ పురిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. అసోషియేషన్ ప్రతినిధులకు సిర సహస్ర రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాకేష్‌శర్మకు పదవిపై హర్షం

రామభద్రపురం: బ్రాహ్మసాధికార సమితి టీడీపీ పార్లమెంట్ కన్వీనర్‌గా ఇనగంటి రాకేష్‌శర్మను నియమించడంపై జిల్లా బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు బాదంపూడి నాగరామలింగేశ్వరశర్మ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాకేష్‌శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో బలిజేపల్లి శ్రీకాంత్, విజయదుర్గ ఉన్నారు.

కలర్ ప్రింటర్ వితరణ

బాడంగి: స్థానిక జెడ్పీ పాఠశాల దివ్యాంగుల వనరుల కేంద్రానికి రామభద్రపురం మండలం బూసాయవలసకు చెందిన వేంకటేశ్వర బోర్‌వెల్స్ అధినేత మచ్చెట్టి శ్రీను, అనూష దంపతులు రూ.15 వేల విలువగల కలర్ ప్రింటర్‌ను అందజేశారు. ఈమేరకు హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావుకు దీనిని అందజేశారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

రేగిడి: రేగిడి భవిత కేంద్రానికి చెందిన ప్రత్యేక అవసరాల పిల్లలు జిల్లా స్థాయి క్రీడల్లో సత్తాచాటారు. విద్యార్థులు ఎస్.వసంత్‌కుమార్, ఎస్ పూర్ణిమ షాట్‌పుట్, రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఉపాధ్యాయులు మహేశ్వరి, రాజేష్ సోమవారం విలేకరులకు తెలి పారు. ఎంఈవోలు వరప్రసాదరావు, ఎరకయ్య అభినందించారు.

పశువులకు గాలికుంటు టీకాలు

లక్కవరపుకోట: మండలంలోని కాసాపేట గ్రామంలో సోమవారం మండల పశువైద్యాధికారి కే.గాయత్రి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ముందుగా 40 పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. అన్ని ఆర్బీకేల్లో టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

రేపు కోడూరులో కోలాటం పోటీలు

బొబ్బిలి: సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈ నెల 10న బాడంగి మండలం కోడూరులో స్వర్ణభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోలాటం పోటీలను నిర్వహించనున్నట్లు చైర్మన్ తెంటు సత్యంనాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ పోటీలకు మొత్తం 135 బృందాలు దరఖాస్తు చేసుకున్నాయని, వాటిలో 35 కళా బృందాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

దొంగతనాలపై అప్రమత్తం

రాజాం రూరల్: దొంగతనాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజాం టౌన్ సి.ఐ. కె.రవికుమార్ హెచ్చరించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా దూర ప్రాంతాలకు వెళ్లేవారితో పాటు అత్యవసర పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఇళ్లలో బంగారం, విలువైన ఆభరణాలు, నగదు ఉంచవద్దని హితవు పలికారు. వ్యాపార సముదాయాలతో పాటు అపార్ట్ మెంట్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే 100, 112 నెంబర్లకు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఏయూతో జేఎన్‌టీయూ ఎంవోయూ

విజయనగరం రూరల్: స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విశ్వ విద్యాలయంలో సోమవారం ఏపీ ఎలక్ట్రానిక్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ ఏర్పాటుకు రోసయ్ విజువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్- ఏయూ విశాఖ కేంపస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు పరస్పరం అంగీకారం తెలుపుకుంటూ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈ ఎమ్ఓయూతో యూనివర్సిటీలోని కళాశాల విద్యార్థులతో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థుకు డ్రోన్ టెక్నాలజీతో ఇంటర్న్‌షిప్ నకు అవకాశం కలుగుతుందన్నారు. రిజిస్ట్రార్ జయసుమ, ప్రిన్సిపల్ శ్రీకుమార్, కె.బా బు, కేసీబీ రావు, డి.రాజ్యలక్ష్మి, ఆర్.గురునాథ, జీజే నాగ రాజు, రోసయ్ ప్రతినిధులు సతీష్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై సమావేశం

లక్కవరపుకోట: మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెల వరకు జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ చేసేందుకు ఏపీడీ శారదాదేవి సోమవారం సిబ్బందితో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 800 పనులకు సంబంధించి రూ.19కోట్లు ఖర్చయ్యాయని తెలిపారు. ఈ నెల 18 నుంచి అన్ని గ్రామాల్లో సోషల్ ఆడిట్ మొదలవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కే.రూపేష్, ఏపీవో విజయలక్ష్మి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

స్పందనకు 227 వినతులు

కలెక్టరేట్, జనవరి 8: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి 227 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 166 అందగా, డీఆర్‌డీఏకు 25, మున్సిపల్ శాఖకు 14, గ్రామ వార్డు సచివాలయలకు 11, హౌసింగ్‌కు 4 వినతులు అందాయి. వచ్చిన వినతులను డీఆర్‌వో అనిత, ఆర్‌డీవో సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుదర్శనదొర వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కింద రూపొందించిన పుస్తకాన్ని డీఆర్‌వో ఆవిష్కరించారు. ● సంతకవిటి మండలం గరికిపాడు గ్రామ సచివాలయం పరిధిలో సోమ న్నపే టకు చెందిన దాసరి జ్యోతి, దాసరి దుర్గా ప్రసాద్‌లకు అధికంగా భూమి ఉన్నా రైస్ కార్డు మంజూరు చేశారంటూ ఆదే మండలం గరికిపేట గ్రామానికి చెందిన బి.లక్ష్మణ రావు జగనన్నకు చెబుదాంలో విన్నవించుకున్నారు. దాసరి దుర్గా ప్రసాద్ ప్రభుత్వ పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పని చేస్తున్నారని, దీనికి తో డు దుర్గా ప్రసాద్, జ్యోతికి అత్యధికంగా భూ ములు ఉ న్నాయని, అయి నా వారి పేరున రైస్ కార్డు మంజూ రు చేశారని, వెంట నే రద్దు చేయాలని కోరారు. ● వికలాంగుల 2016 చట్టాన్ని అమలు చేయాలని వికలాంగ హక్కుల పోరాట సమితి నాయకులు జగనన్నకు చెబుదాంలో విన్నవించుకున్నారు. వికలాంగుల పింఛ ను 3000 నుంచి 6000 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. అంత్యోదయ రేషన్ కార్డు ఇప్పించాలని కోరారు. అర్హులైన వికలాంగులందరికీ ఇళ్ల పట్టాలు మంజూ రు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.


వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో అనిత

మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

● అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్ ● 'స్పందన' కార్యక్రమానికి 35 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, జనవరి 8: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నమ్మించి మోసాలకు పాల్పడే వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి 35 ఫిర్యాదులు స్వీకరించారు. ● విజయనగరానికి చెందిన వ్యక్తి అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్‌కు ఫిర్యాదు చేస్తూ తన కుమారుడికి ఉద్యోగం కల్పిస్తానని నమ్మించి వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న వ్యక్తి తమ నుంచి రూ.3 లక్షలు తీసుకున్నారని తెలిపారు. ఉద్యోగం కల్పించకపోవడంతో తిరిగి డబ్బులు ఇచ్చేయాలని కోరినప్పటికీ ఇవ్వడం లేదని...న్యాయం చేయాలని కోరారు. ● ఎల్‌కోట మండలం రేవళ్లపాలెంనకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేస్తూ ఎస్‌కోటకు చెందిన వ్యక్తి వద్ద చిట్టీలు నిమిత్తం రూ.లక్ష కట్టామని... వాయిదా పూర్తయినప్పటికీ సంబంధిత నగదు చెల్లించడం లేదని న్యాయం చేయాలని కోరారు. ● సంతకవిటి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేస్తూ, తాను 19.700 టన్నుల మొక్కజొన్న పిక్కలను తెర్లాం మండలానికి చెందిన వ్యక్తికి రూ.10 లక్షలకు విక్రయించానని తెలిపారు. రూ.4 లక్షలు మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఈ ఫిర్యాదులు స్వీకరించిన ఏఎస్‌పీ ఆస్మాపరహీన్ వీటిని తక్షణమే పరిష్కరించి తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మండా జావలి ఆల్ఫాన్స్, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐ మురళి, ఎస్ఐ వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఏఎస్పీ ఆస్మాపరహీన్

అవసరం లేని వస్తువులు తొలగించాలి

● ఖజానా అధికారులకు ఆదేశించిన జేసీ మయూర్ అశోక్

కలెక్టరేట్, జనవరి 8: జిల్లాలోని ఖజానా కార్యాలయాల్లో ఉన్న స్ట్రాంగ్ రూంల్లో వివిధ ప్రభుత్వ శాఖలు భద్రపరిచిన వస్తువులను పరిశీలించి అవసరం లేని వాటిని తక్షణమే తొలిగించాలని జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. జిల్లా ఖజానా కార్యాలయాల్లో స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన వస్తువులపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం జేసీ చాంబ ర్‌లో నిర్వహించారు. సాధారణ సార్వత్రిక ఎన్నికల సామగ్రి నిల్వ చేసేందుకు స్థలాభావం ఏర్పడనుండడంతో వివిధ శాఖలకు సంబంధించిన వస్తువులను తొలిగించేందుకు రాష్ట్ర ఖజానా శాఖ జిల్లా స్థాయిలో ఒక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల్లో శాఖల వారీగా భద్రపరచిన వస్తువులను తిరిగి తీసుకునేవి, డిస్పోసల్ చేసేవి, భద్రపరచేవిగా గుర్తించేందుకు ఈ సమావేశంలో నిర్ణయించామన్నారు. సమావేశంలో జిల్లా ట్రెజరీ అధికారి ఆర్ఎస్ కుమార్, అదనపు ఎస్పీ, జడ్పీ సీఈవో రాజ్ కుమార్ ఉన్నారు.


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

అందని పింఛన్లు

శృంగవరపుకోట రూరల్, జనవరి 8: 'ప్రతి నెల ఒకటో తేదీన వచ్చే పింఛను ఈనెల 8వ తేదీ వచ్చినా ఇంకా ఇవ్వ లేదని పింఛనుదారులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లోని లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు పింఛన్లు వచ్చాయని చెబుతున్నారని... కానీ నేతలు వస్తేనే పంపిణీ చేస్తామనడం బాధ కలిగిస్తోంద న్నారు. ధర్మవరం గ్రామ పింఛనుదారులు మాట్లాడుతూ 8వ తేదీ దాటినా ఇంకా పింఛను అందకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై ధర్మవరం ఈవో రంగారావును వివరణ కోరగా 8వ తేదీ మధ్యాహ్నం పింఛనుకు సంబంధించిన నగదు బ్యాంకుల్లో జమైందని... దీనిని తీసుకొని వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. మండలంలో పింఛను పంపిణీలో జాప్యంపై వివరణ కోసం ఎంపీడీవోను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు.


ధర్మవరం గ్రామ సచివాలయం

సీఎం అసమర్థ పాలనతో తీవ్ర ఇబ్బందులు

రాజాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థపాలనతో రాష్ట్రంలో నిరుద్యోగులు, యువకులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయని మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ దుయ్యబట్టారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డీఎస్సీకి దిక్కు లేదు, పోలీసు ఉద్యోగాలు భర్తీకాలేదు, యువతకు భరోసా లేదని ఆదేవన వ్యక్తం చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సబ్సిడీలను కూడా ఎత్తి వేశారని, దళిత బీసీ ల పథకాలు కూడా ఎత్తివేసి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ఇలా ఏకంగా 100 కు పైగా పథకాలను రద్దు చేస్తూ పాలనను కొనసాగిస్తున్నారని విమర్శించారు.

శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి

దాసన్నపేట, జనవరి 8: రాష్ట్రంలోని శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని జిల్లా శిష్ట కరణాల సంఘ అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు కోరారు. ఆదివారం రాత్రి శిష్ట కరణాల ఆత్మీయ సమ్మేళనంలో జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ శిష్ట కరణాలతో పాటు మరో ఐదు కులాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఎంపీని కలిసిన వారిలో ఆల్ ఇండియా శిష్టకరణ సంఘ అధ్యక్షులు డీఈవీ కృష్ణారావు, రాష్ట్ర అధ్యక్షులు పోలిమహంతి ఉమామహేశ్వరరావు, జిల్లా శాఖ ప్రతినిధులు రేగ సురేష్, బలివాడ వెంకటరమణారావు, వి.వెంకటేష్, ఏటీ వరప్రసాద్, సంజీవ రావు, పరమేశ్వరరావు, ఎ.తిరుపతిరావు, నాగరాజు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


గౌరీశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

రాజాంలో రక్తదాన శిబిరం

రాజాం: మాజీ మంత్రి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీ మోహన్ జన్మదిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో సోమవారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజాం టౌన్ రూరల్ మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 51 మంది రక్తదానం చేశారు. అనంతరం స్థానిక సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు.


రక్తదానం చేస్తున్న అభిమానులు

రోడ్డు పనుల పరిశీలన

రేగిడి: పాలకొండ- రాజాం రోడ్డులో పూర్తయిన 30శాతం మరమ్మతుల నాణ్యతపై అర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కరరావు, ఈఈ నాయక్ బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రూట్లో 15 కిలోమీటర్లు అక్క డక్కడ బాగున్న రోడ్డుపై మళ్లీ వేసినా... దీని నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ బృందం అభ్యంతరం చెప్పలేదు. పాలకొండ- రాజాం రోడ్డులో 15 కిలోమీటర్ల మేర జరుగుతున్న పనులను సోమవారం ఎస్ఈ, ఈఈ , డీఈఈ రామచంద్రరావు తనిఖీ చేశారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించండి

శృంగవరపుకోట: తక్షణమే జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పనులను ప్రారంభించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శృంగవరపుకోటలో సోమవారం ఈ సంఘ జిల్లా అధ్యక్షుడు కండిపల్లి భీముడు విలేకర్లతో మాట్లాడారు. ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. ధార్ ఆధారిత చెల్లింపులు రద్దుచేయాలన్నారు.

పోలియో నిర్మూలనకు రోటరీ కృషి

బొబ్బిలి: అంతర్జాతీయ స్థాయిలో పోలియో నిర్మూలనకు రోటరీ అంతర్జాతీయ సంస్థ విశేష కృషి చేస్తోందని రోటరీక్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు తెలిపారు. ఓ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలియో నిర్మూలనకు నిధుల సేకరణకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. వీటితో పాటు సంస్థ తరపున చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. రోటరీ ప్రతినిధులు గెంబలి శ్రీనివాసరావు, శ్రీహరి, శ్రీనివాసన్, ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

పాతరేగలో పారిశుధ్య పనులు

రామభద్రపురం: మండల పరిధిలోని పాతరేగ గ్రామంలో సోమవారం సర్పంచ్ ప్రతినిధి గొట్టాపు పైడిపునాయుడు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అలాగే బ్లీచింగ్ చల్లి, కాలువల్లో పూడికలు తీసి దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు, సచివాలయ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు

చిట్టంపాడుకు పక్కా రోడ్డు

● ఎస్ఈని ఆదేశించిన కలెక్టర్

శృంగవరపుకోట రూరల్, జనవరి 8 : గిరిశిఖర గ్రామం చిట్టంపాడుకు రహదారి సౌకర్యం లేదని... 'జోలీపై చేర్చినా నిలవని ప్రాణం' అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై కలెక్టర్ నాగలక్ష్మి యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ రమేష్ గుప్తాతో ఈ కథనంపై చర్చించారు. దీనిపై ఎస్ఈ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జన్‌మన్ కింద రూ.10.04 కోట్లతో పక్కా రోడ్డుకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. విశాఖ-అరుకు ప్రధాన రహదారి నుంచి శెనగపాడు, చిట్టంపాడు మీదుగా గూనపాడు వరకు పది కిలోమీటర్లు రోడ్డు నిర్మిస్తామని చెప్పారు.


పక్కా రోడ్డుగా మారనున్న చిట్టంపాడు, గూనపాడు రహదారి

9 నెలలకు రూ.6 లక్షల 51వేలు!

● కారు అలవెన్స్ డ్రా చేసిన ఎంపీడీవో

రామభద్రపురం: 9 నెలలకు గానూ రూ.6 లక్షల 51వేలను కారు అలవెన్స్ కింద రామభద్రాపురం ఎంపీడీవో రమామణి డ్రా చేసినట్టు ఆర్టీఏ యాక్ట్ ద్వారా తెలిసిందని మిర్తివలస వైసీపీ కార్యకర్త గిరడ షణ్ముఖరావు స్థానిక విలేఖర్లకు తెలిపారు. ఒక్కరోజులోనే మండల కేంద్రం నుంచి అతితక్కువ దూరాన ఉన్న గ్రామపంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాల తనిఖీలకు వెళుతున్నట్టు చూపించి డబ్బులు డ్రా చేశారన్నారు. మండలానికి కూతవేట దూరంలో ఉన్న ఆరికతోట, నర్సాపురం, దుప్పలపూడి గ్రామ పంచాయతీలకు ఒక్కరోజులోనే 107 కిలోమీటర్లు తిరిగినట్టు చూపించారన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలు సుమారు 15 కిలోమీటర్లదూరంలో ఉన్నప్పటికీ ఒక్కరోజు 105, మరొకరోజు 98, ఇంకొకరోజు 105 కిలోమీటర్లు చొప్పున ప్రతి రోజు తిరిగినట్టు చూపించి ఈ నిధులు విత్‌డ్రా చేశారన్నారు. జిల్లా అధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు జరిపి ఆమె నుంచి నగదును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

● దీనిపై ఎంపీడీవో రమామణిని వివరణ కోరగా కారు అలవెన్స్ కింద నెలకు రూ.27వేలు మాత్రమే డ్రాచేశామని, కేంద్ర బృందం రావడంతో ఉపాధిహామీ పథకం పనులు పరిశీలించామని తెలిపారు.

మోకాళ్లపై న్యాయవాదుల నిరసన

కొత్తవలస, జనవరి 8 : రైతులకు గుదిబండలా మారిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కొత్తవలస న్యాయవాద సంఘ సభ్యులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ చట్టం వల్ల రైతులు పూర్తిగా నష్టపోతున్నారని... సివిల్ కోర్టులకు భూ సంబంధిత సమస్యలను విచారించే అధికారం లేకుండా న్యాయమూర్తుల విధులను హరిస్తోందన్నారు. న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు రైతులు పోరాటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దీన్ని నిరసిస్తూ ఈ నెల 12 వరకు కోర్టు విధులకు దూరంగా ఉంటున్నట్టు న్యాయవాద సంఘ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గిరిబాబు, గొడుగులన మహేంద్ర, రామచంద్ర ప్రసాద్, కేహెచ్ రాజారావు, డి.శివప్రసాద్, ఎం.కృష్ణమూర్తి, డీవీఏ లక్ష్మీదేవి, డి.శ్రీనివాస్, అచ్చిబాబు, నందిపల్లి శ్రీరామ్మూర్తి, వై.జి.నాయుడు, ఎస్‌వీ సత్యనారాయణ, పీఎస్‌కే ప్రసాద్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు


రామభద్రపురం: ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎస్మా ప్రయోగం తగదు

- 28వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె
- మద్దతు తెలిపిన టీడీపీ, వివిధ సంఘాల నాయకులు

తమ డిమాండ్ల సాధనకు గత 28 రోజులుగా పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా జీవోని ప్రయోగించడం తగదని టీడీపీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోగా, బెదిరించే విధంగా జీవో2ను తీసుకురావడం ఏమాత్రం తగదన్నారు. తమ సమస్యలను పరిష్కరించేవారకు సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. పలు చోట్ల టీడీపీ నాయకులు సమ్మె శిబిరాల వద్దకు చేరుకుని, అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలకు టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


కొత్తవలస: అంగన్‌వాడీలతో సమ్మెలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి


బెలగాం: సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జగదీష్


బెలగాం: అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న బోనెల విజయ్‌చంద్ర


భోగాపురం: గడ్డి తింటూ నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు


చీపురుపల్లిలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కొమరాడ: గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం


రాజాం రూరల్: రిలే దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు


బొబ్బిలిలో దండాలు పెడుతూ అంగన్‌వాడీల నిరసన


ఎస్.కోటలో..

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

- సామాజిక తనిఖీల్లో బయటపడిన అవినీతి


ప్రజావేదిక నిర్వహిస్తున్న దృశ్యం

పూసపాటిరేగ: మండలంలోని ఉపాధిహామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీల్లో భాగంగా సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు పంచాయతీల్లో నిర్వహించిన పనుల్లో జరిగిన అవకతవకలపై డ్వామా పీడీ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో చర్చించారు. స్థానిక క్షేత్రసహాయకుడు కారిపి అప్పలనాయుడు పంచాయతీలో లేని వారి పేరున కూడా మస్తర్లు వేసి, కూలీలు తీసుకున్నట్లు చూపించటంతో దీనిపై ఆమె మండిపడ్డారు. వెంటనే సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే రెల్లివలస గ్రామంలో మరణించినవారు పని చేస్తున్నట్లు అక్కడ ఎఫ్ఏ సీహెచ్ త్రినాథ నమోదు చేయటంతో ఆయన్ని కూడా సస్పెండ్ చేస్తున్నట్టు చెప్పారు. కొన్ని గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటినట్లు చూపినా అక్కడ మొక్కలు లేవని తెలిపారు. దీనిపై వెంటనే మొక్కలు వేసి జాగ్రత్తగా చూడాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో మంతెన రాధిక, స్థానిక ఏపీవో రత్నమాల, ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోనూరు టెక్నికల్ అసిస్టెంట్..

గరివిడి: కోనూరు గ్రామంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దాలినాయుడు అనే వ్యక్తిని సివిల్ సప్లయ్స్ అధికారులు సస్పెండ్ చేశారు. కోనూరు గ్రామానికి చెందిన ఒక రైతు.. తాను పండించిన ధాన్యాన్ని ఒక మిల్లర్‌కు అమ్మడానికి పంపించగా, తేమ శాతం తప్పుగా చూపించి, కొలతలు వేసినందుకు సదరు అధికారిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినాయుడు


పతివాడ, తమ్మినాయుడును సత్కరిస్తున్న దృశ్యం

పూసపాటిరేగ: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు తనయుడు తమ్మినాయుడిని నియమించారు. ఈమేరకు సోమవారం తన స్వగృహమైన చల్లవానితోటలో ఆయనకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. అభినందించిన వారిలో టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు తదితరులు ఉన్నారు.

గ్రామంలో సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న కార్యదర్శి రామకృష్ణనాయుడు

భోగాపురం: తమ గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలంటూ భోగాపురం గ్రామానికి చెందిన యువకులు డిమాండ్ చేశారు. సోమవారం భోగాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన యువకులు మాట్లాడుతూ గ్రామంలో సీసీ రహదారులు వేయాలని, శ్మశాన వాటికలు బాగు చేయాలని కోరారు. పెద్దవీధిలో ట్రాఫిక్ క్లియరెన్స్, గ్రామంలో చెరువు గట్లును అభివృద్ధి చేసి వాటిని పార్కులు, వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్దాలని, పంచాయతీ స్థలాలు ఆక్రమణలు అరికట్టాలని, బట్టికాలువ అంచున రక్షణగోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామ సభకు వార్డు మెంబర్లు హాజరు కాకపోవడంతో యువకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ, మాజీ ఉప సర్పంచ్ కొమ్మూరు సుభోషణరావు, సుందర హరీష్, పడాల భానుప్రకాష్, కార్యదర్శి రామకృష్ణనాయుడు, బంగార్రాజు, బొల్లు గాంధీ, రౌతు వాసుదేవరావు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

- పార్వతీపురం మన్యం డీఈవో ప్రేమ్‌కుమార్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పాఠశాలలు ఈనెల 9వ తేదీ నుంచి 18 వరకు తప్పనిసరిగా మూసివేయాలని, ఎటువంటి తరగతులు నిర్వహించినా ఆయా పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో ప్రేమ్‌కుమార్ సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధన పాటించాలని, సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రైవేటు పాఠశాలల తరగతులు నిర్వహిస్తే వాటి అనుమతులు రద్దు చేస్తామని చెప్పారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించండి

పాలకొండ: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు రావాడ సుమంత్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొండ ఆర్డీవోకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంగా జగన్ ఎన్నికైన తర్వాత యువతకు ఇచ్చిన హామీలన్నీ తుంగ లోకి తొక్కారన్నారు. రెండు లక్షల 30 వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగ యువతను మోసగించారని చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగులు 74 శాతం ఉన్నారంటే ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొంగ శివానంద, సర్పంచ్‌లు అల్లుబిల్లి బాబు, వావిలపల్లి రమణమూర్తి, గురుబిల్లి చంద్రశేఖర్, గురుబిల్లి దిలీప్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూడాలి

- మాజీ ఎమ్మెల్యే కేపీ నాయుడు

గజపతినగరం: రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో నిబంధనలు తొక్కి రైతుల వద్ద నుంచి క్వింటాకు 5 కిలోల చొప్పున దోచుకోవడం తగదన్నారు. తుఫాన్ కారణంగా ధాన్యం రంగు మారడంతో మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని దీంతో రైతులకు ప్రభుత్వం ఇస్తున్న గిట్టుబాటు ధర రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుభరోసా కేంద్రాల్లో టీడీపీ సానుభూతిపరులకు ధాన్యం మిల్లుకు తరలించేందుకు ఇబ్బందులు సృష్టిడం తగదన్నారు. మిల్లర్లు, అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ ఎం.అరుణకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం, బొండపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఎ.లక్ష్మునాయుడు, కోరాడ కృష్ణ, సీనియర్ నాయకులు పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, బొండపల్లి మాజీ జడ్పీటీసీ బి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాయుడు, పార్టీ నాయకులు, రైతులు

ధాన్యం కొనుగోలులో అవకతవకలు

- అధికారులపై సర్పంచ్‌ల ధ్వజం

బొండపల్లి: రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్మే క్రమంలో కొనుగోలుదారులు అవకతవకలకు పాల్పడుతున్నారని పలువురు సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా వ్యవసాయ శాఖకు సంబంధించి మరువాడ కొత్తవలస, బి.రాజేరు, కనిమెరక సర్పంచ్‌లు మాట్లాడుతూ పంటను మిల్లులకు పంపించేటపుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. తేమ శాతం అధికంగా ఉందనే పేరుతో సుమారు నాలుగు కేజీల ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారని సర్పంచులు ధ్వజమెత్తారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని స్పష్టం చేసినా.. కార్యరూపం దాల్చడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్‌కు సంబంధించి తాగునీరు పూర్తి స్థాయిలో ఎప్పుడు సరఫరా చేస్తారని వేంద్రాం, మరువాడ కొత్తవలస, కిండాం అగ్రహారం సర్పంచ్‌లు కర్రోతు శ్రీనివాసరావు, బుంగ దేవుడులు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని ప్రశ్నించారు. సీపీడబ్ల్యు స్కీం నిర్వహణ లోపంతో మరువాడ కొత్తవలసలో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. సంక్రాంతి పండగకు పూర్తి స్థాయిలో ప్రజలకు నీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ సర్పంచ్‌లకు బదులిచ్చారు. గొట్లాంలో ఉన్న ఆయుర్వేదిక్ డిస్పెన్సరీని బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించవద్దని పీఏసీఎస్ అధ్యక్షులు మహంతి రమణ కోరారు. ఈ విషయంలో ఎంపీపీ చలంనాయుడు జోక్యం చేసుకుంటూ సమస్యను ఎమ్మెల్యే అప్పలనరసయ్య దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీవో వైవీ రాజేంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ సుగుణాకరరావు, వైస్ సర్పంచ్ గొండేల ఈశ్వరరావు, సర్పంచ్‌లు నడుపూరు భాస్కరనాయుడు, కర్రి సత్యవతి, లండ నారాయణమ్మ, శిరిపురపు పూర్ణిమ, ఎంపీటీసీలు తాళ్లపూడి అప్పలనాయుడు, బండారు బంగారం, బండారు శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఓపీఎస్ కోసం రైల్వే ఉద్యోగుల నిరసన


ఎస్.కోటలో నిరసన చేస్తున్న ఈస్ట్‌కోస్ట్ శ్రామిక యూనియన్ సభ్యులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట రైల్వే స్టేషన్ వద్ద సోమవారం ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) పిలుపు మేరకు ఈస్ట్ కోస్ట్ శ్రామిక్ యూనియన్‌కు చెందిన రైల్వే ఉద్యోగులు నిరసన చేపట్టారు. న్యూ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. న్యూపెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ పీకే పట్నసీ నాయకత్వంలో న్యూ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తున్నట్లు ఈ యూనియన్ డిప్యూటీ డివిజనల్ కోఆర్డనేటర్ పీ.ఆర్.ఎం రావు తెలిపారు. ఓల్డ్‌పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. అరకు బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ జి.దామోదర్ రావు తెలిపారు.

రెగ్యులర్ ప్రిన్సిపాల్స్‌ను నియమించాలి

- గిరిజన సంక్షేమ సంఘ నాయకుల డిమాండ్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో రెగ్యులర్ ప్రిన్సిపాల్స్‌ను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు సంఘం తరపున పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భద్రగిరి పీటీజీ బాలికల పాఠశాలకు రెగ్యులర్ మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించాలని సూచించారు. సీతానగరం మండలం జోగింపేటలోని గిరిజన ప్రతిభా పాఠశాల/కళాశాలకు కళాశాల స్థాయి ఉన్న రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని కోరారు. పార్వతీపురంలో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థి గాయాలపాలై జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని పీవోను కోరారు.

జగన్ ప్రభుత్వంలో నష్టపోయింది కార్మికులే..

- టీఎన్‌టీయూసీ కార్మిక సంఘ అధ్యక్షుడు రఘురామరాజు

కొత్తవలస: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే తీవ్రంగా నష్టపోయింది కార్మికులేనని టీఎన్‌టీయూసీ కార్మిక సంఘ అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు అన్నారు. కార్మిక చైతన్య బస్సు యాత్రలో భాగంగా కొత్తవలస వచ్చిన కార్మిక సంఘ నాయకులకు శృంగవరపుకోట నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు పిల్లా అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక లేకుండా చేసి నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది కార్మికులను వీధిన పడేశారన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు లేకుండా చేసి కార్మికుల వలసలకు కారణమయ్యారన్నారు. ఉన్న పరిశ్రమలను ఇక్కడ నుంచి తరిమేసి కార్మికులను పక్క రాష్ట్రాలకు పంపిన ఘనత ఆయనకే దక్కుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ఎస్.కోట ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి, టీడీపీ నాయకులు కోళ్ల వెంకటరమణ, బంగారు రమేష్, మాకెన సీతారామపాత్రుడు, లాలం అర్జునరావు, కొరుపోలు అప్పారావు, ఎల్లపు సూరిబాబు, లెంక శ్రీను, కనకాల శివ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఉదయ్‌కిరణ్

రాజాం /రూరల్: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ముచ్చుపల్లి ఉదయ్‌కిరణ్ ఢిల్లీలో రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొంటాడని ఎన్ సీసీ కెప్టెన్ ఎస్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు అభినందించారు.

'జన్ భగీరథ'ను విజయవంతం చేయాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో జన్‌భగరీథ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేసీ ఆర్.గోవిందరావు అన్నారు. జన్ భగీరథపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ జనవరి 19న విజయవాడలో 125 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహావిష్కరణ జరుగుతుందని, అందులో భాగంగా జన్ భగీరథ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 11 వరకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జిల్లా ప్రధాన కేంద్రంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలకు మంగళవారం నుంచి పండగ సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి, పాఠశాలలకు హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



డెంకాడ: అక్కివరం ఆదర్శ పాఠశాలలో..


మెరకముడిదాం: చినబంటుపల్లి ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


బొబ్బిలి: కింతలవానిపేట పాఠశాలలో..


లక్కవరపుకోట: మహాత్మజ్యోతీబాపూలే బాలికల పాఠశాలలో..


ఎస్.కోట రూరల్: జామిలో..


రేగిడి: కొండవలసలో..

క్లుప్తంగా..

చేతులెత్తితే.. ఏదేదో రాస్తారు

మెంటాడ: మెంటాడలో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు రానివారు ఉంటే చేతులు ఎత్తాలని అన్నారు. దీంతో మెంటాడకు చెందిన పెంటమ్మ తనకు పింఛన్ రాలేదని మొరపెట్టుకుంది. భర్త పోయి నాలుగేళ్లు అయ్యిందని అప్పటి నుంచి దరఖాస్తులు చేస్తున్నా పింఛన్ రాలేదని చెప్పింది. ఆమెతో పాటు ఇంకొందరు చేతిలెత్తి, స్వరం కలిపారు. మీరు చేతులెత్తితే విలేకర్లు ఏదేదో రాస్తారని మంత్రి అన్నారు. వెంటనే కార్యకర్తలు వారికి సైగలు చేసి, కూర్చోమని చెప్పారు. అలాగే ఇంకెవరికి సంక్షేమ పథకాలు రాలేదో చెప్పాలని అనడంతో అంతా బిత్తర చూపులు చూశారు. అనంతరం మెంటాడ సచివాలయం, చల్లపేట పీహెచ్‌సీలను మంత్రి ప్రారంభించారు.

జీవో-2ను ఉపసంహరించుకోవాలి

నెల్లిమర్ల: సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం విచారకరమని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. ఆయన సోమవారం నెల్లిమర్లలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎస్మాను ఉద్దేశించి ప్రభుత్వం జారీ చేసిన జీవో-2ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు పాతబొబ్బిలిలో ఆరోగ్య సురక్ష

బొబ్బిలి: ఈనెల 10న పాతబొబ్బిలి సచివాలయంలో ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమీషనరు సత్తారు శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి విధివిధానాలను వారికి వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఈ కార్య క్రమంలో ప్రజలందరికీ నాణ్యమైన సేవలందించాలని అన్నారు. ఈ సమావేశంలో మేనేజరు బీఎండీ శివ ప్రసాద్, టీపీఆర్ఓ జగన్మోహన్, వైద్యాధికారి సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం కొండల మీద మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భద్రగిరి ఐటీడీఏ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి నేటికి 77 ఏళ్ల గడిచినా మారుమూల కొండల మీద గ్రామా లకు రోడ్డు సౌకర్యం లేకపోవడం విచారకరం అన్నారు. నేటికీ గిరిజన గ్రామాల్లో డోలీలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.